

# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## – వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు (డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974-75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016-17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

# రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

## *చివరి విడత: మలి సందడి (41)*

*రావుగారి ముచ్చట్లు*

విదేశాల్లో ఉంటున్నా, అక్కడివారితో పాలూ నీరులా కలిసిపోయినా– మన భాష, సంస్కృతి, సంప్రదాయాల్ని గౌరవిస్తూ, కాపాడుకుంటూ తెలుగువారు నిత్యజీవితాన్ని ఎలా రసమయం చేసుకుంటున్నారో రసాత్మకంగా చెప్పాలంటే రావుగారింటి ముచ్చట్లు మాకు మా స్థాయిలో శ్రీకృష్ణదేవరాయలవారి భువనవిజయం.

రాయలవారి ఆస్థానంలో సాహిత్యానిదే ప్రథమ తాంబూలం.

శ్రీకృష్ణదేవరాయలవారి కొలువులో అష్టదిగ్గజాలని పేరు పడ్డ ఎనమండుగురు మహాకవులుండేవారు. వారిలో ఒకరు కాకపోయినా, రాయలవారు కూడా స్వయంగా అశ్టదిగ్గజాలంత మహాకవి.

కవి పండితులకు రాయలవారి కొలువొక పుణ్యతీర్థం. తమ కవన, పాండితీప్రతిభను [ప్రదర్శించి రాయలవారి సత్కారాన్ని పొందాలని ఆత్రపడేవారికది పరీక్షాస్థలం. అష్టదిగ్గజాలను మించినవారమని నిరూపించుకోవాలని తహతహలాడేవారికది సవాలుగా అలరించే క్రీడాస్థలం. రసిక హృదయులైన ప్రేక్షకులకది ఒక అపూర్వ రంగస్థలం.

రాయల కొలువులోని సాహితీ విశేషాలు భువనవిజయం పేరిట ఎంత ప్రాచుర్యం పొందాయంటే, నేటికీ దేశవిదేశాల్లో సాహితీ ప్రియులైన తెలుగువారు ఏదో రూపంలో భువనవిజయాలు నిర్వహిస్తున్నారు. వారి వారి అభిరుచి, సామర్ధ్యాల్ని బట్టి నేటి కవి పండితులు ఆ సభల్లో అష్టదిగ్గజాల పాత్రల్ని పోషిస్తుండడం కద్దు.

భువనవిజయాలపై అవగాహన కలిగించే కొన్ని రసాత్మక సన్నివేశాల్ని, 1956లో విడుదలైన 'తెనాలి రామకృష్ణ' చిత్రంలో రసరమ్యంగా, పండితపామరజనరంజకంగా ఇమిడ్చారు ఆ చిత్ర దర్శకులు బిఎస్ రంగా.

రావుగారు కవి కాదు.

మేము రచయితలమని వారికి తెలియదు.

మామధ్య జరిగినవీ కవితాగోష్టులు కావు.

ఐనా మొదటిసారి వాళ్లింట ఆతిథ్యం స్వీకరించినప్పుడు పొందిన రసానుభూతిలో అప్పటి 'తెనాలి రామకృష్ణ'లోని భువనవిజయ సన్నివేశాలు ప్రధానం కావడం వల్లనేమో అప్రయత్నంగా భువనవిజయం అన్న పేరు స్ఫురించింది.

*రావుగారింట్లో భువన విజయం*

రావుగారి భార్య సత్యవతి సంగీతంలో నిష్ణాతులని వాళ్లు మా ఇంటికొచ్చినప్పుడే తెలిసింది. 'హృదయతంత్రులు మీటిన మృదుల జీవితవీణానాదాన్ని' మరల మరల వినాలన్న తహతహ అప్పుడే మాలో చోటు చేసుకుంది.

అందుకే ఆరోజు వాళ్లింటికెళ్లగానే ముందు పాట గురించే అడగాలనుకున్నాను.

శ్రీమతి వారించింది.

"ప్రతిదానికీ ఓ సమయముంటుంది. ఆ సమయం నాకు తెలుసు. నేనడిగేదాకా మీరా ప్రసక్తి తేవద్దు" అందామె.

సమయోచితం పాటించడం సభా సమావేశాల్లోనే కాదు, బంధుమిత్రులు కలిసినప్పుడూ అవసరమే. ఐనా ఆ విషయం మర్చిపోవడం మనిషి బలహీనత. అలాంటప్పుడు అయినవాళ్లు కలగజేసుకుని సున్నితంగా హెచ్చరిస్తుంటారు.

ఆ హెచ్చరికని అర్థం చేసుకోవడం– వారివారి అహం, హోదా, సంయమనం వగైరాలపై ఆధారపడి ఉంటుంది.

'అనువు కానిచోట అధికుల మనరాదు' అన్న వేమన మాటని బాగా అర్థం చేసుకున్న దంపతులం.

ఎక్కడ ఎవరు తగ్గాలో ఇద్దరికీ తెలుసు. ఐనా మానవమాత్రులం కాబట్టి అప్పుడప్పుడైనా అజ్ఞానంలో పడి గొడవ పడుతుంటాం.

అలా అజ్ఞానులమై మాలో మేము గొడవపడ్డ సందర్భాలు కొన్ని లేకపోలేదు. ఇతరుల ఎదుట కూడా, చనువున్న వాతావరణంలో ఐతే అలాంటి గొడవలకు వెనుకాడని సందర్భాలూ ఉన్నాయి.

అప్పటికే రావు దంపతులతో మాకు తగినంత చనువు ఏర్పడింది. ఐనా కూడా, ఆ రోజు మాత్రం నేను కాస్త జ్ఞానినై ఆమె మాట శిరసా వహించాను.

రావుగారిల్లు చేరేక– ముందు కాసేపు కుశలాలు.

రావుగారి పాప నెలల వయసుది. ఎక్కువ సమయం నిద్రాముద్రలో ఉంటుంది. తనకి నిద్రాభంగం కలిగించడంవల్ల కలిగే పరిణామాలు మహర్షులకు తపోభంగం కలిగించడంవల్ల జరిగేవాటికంటే ప్రమాదకరమైనవన్న జ్ఞానాన్ని ఆ పాప పుడుతూనే తలిదండ్రులకు కలిగించింది. అందుకని ఆ ఇంట్లో ఆమెకోసం ప్రత్యేకంగా ఒక చీకటి గది ఏర్పాటు చేశారు. ఎంత పకడ్బందీగా అంటే, ఒకే ఒక్క కాంతికిరణం ఆ గదిలోకి వెళ్లాలన్నా ఇంటివారి అనుమతి కావాలి.

మేము వెళ్లేసరికి ఆ పాప తన చీకటి గదిలో, ఉయ్యాల్లో నిద్ర పోతోంది.

రెండేళ్ల వాళ్ల బాబు, మా పిల్లల్ని చూడగానే ఎందుకో తెలియని ఆనందంతో ఉత్సాహపడ్డాడు. మావాళ్లతో కలిసి భోంచేసేక ముగ్గురూ ఆటలు మొదలెట్టారు. వాళ్లు ఆడుకుంటుంటే, పెద్దవాళ్లం నలుగురం భోజనాలక్కూర్చున్నాం.

రావుగారింట విందు చిరస్మరణీయంగా ఉంది. ఆ విశేషాలు భువన విజయంలో ఇమడవు కాబట్టి వేరేగా ప్రస్తావిస్తాను.

విందు పూర్తవగానే, "ఇక విందు మొదలౌతుందని ఆశించొచ్చా?" అంది శ్రీమతి.

నేను ఆశ్చర్యపోయాను.

నాకు అనువైనచోట కూడా తనకి ఆధిక్యాన్నిచ్చి పొరపాటు చేశానా అని కూడా అనుకున్నాను.

రావుగారి ముఖంలో విస్మయం.

సత్యవతిగారి మొహంలో చిన్న ఇబ్బంది.

అప్రయత్నంగా కవిబాబు గుర్తొచ్చాడు. కాఫీ తేగానే, 'అప్పుడే కాఫీయా?' అన్నప్పుడు అతడి రౌద్రాకారం చూసినప్పుడు మా మొహాలు బహుశా అలాగే ఉండి ఉంటాయేమో!

చీమ చిటుక్కుమన్నా వినిపించేటంత నిశ్శబ్దం ఏర్పడింది. దాన్ని చీల్చుకుంటూ, "సత్యవతి గారి పాటకోసం ఎదురుచూస్తున్నాం. మాకు అసలైన విందు అదే కదా మరి!" అంది శ్రీమతి.

అంతే– ఒక్కసారిగా అందరి ముఖభావాలూ మారిపోయాయి.

నేనైతే ఫరే చేంజ్ హృదయపూర్వకంగానే మన సంప్రదాయాన్ని తిట్టుకున్నాను.

ఇక్కడి సంప్రదాయమైతే, అక్కడ అందరి ఎదురుగా ఆమెను దగ్గరగా తీసుకుని చిన్న ముద్దు పెట్టేవాణ్ణి.

రావుగారు తక్కువవాడా, "మీరడిగింది విందు గురించే కావచ్చు. కానీ దానికి నన్నిలా హర్ట్ చెయ్యడం భావ్యమా?" అన్నాడు.

మళ్లీ అక్కడ నిశ్శబ్దం. ఇందాకటి ముఖభావాలే ముఖాల్ని మార్చుకున్నాయి.

నిశ్సబ్దాన్ని ఛేదిస్తూ, "నా అంతటివాడొకడు ఇక్కడున్నాడని చూసీ– నా ప్రసక్తే లేకుండా మా ఆవిణ్ణి పాటడుగుతారూ! ఏం– తన పాటేనా, నా పాట మీకు విందు కాదా?" అన్నాడు రావుగారు.

అంతే– ఒక్కసారిగా అక్కడ నవ్వులు విరబూశాయి.

రావుగారు హాస్యప్రియుడు కాబట్టి సరదాకి అలాగనుండొచ్చని గ్రహించి, "లేడీస్ ఫస్ట్ కదా అని ఫస్ట్ ఛాన్స్ నా శ్రీమతికిస్తే అడగడంలో స్త్రీ పక్షపాతం చూపించింది. ఇప్పుడు నాదీ ఛాన్సు" అని రావుగారి వంక తిరిగి, "ముందు మీరు పాడాలి. మీ పాట విన్నాకనే మీ శ్రీమతిగారి పాట. అది ధర్మం కూడా. ఎందుకంటే, మీ శ్రీమతి పాట ఒకసారైనా విన్నాం కానీ, మీ పాట ఇంతవరకూ వినలేదు. కాబట్టి ఈ రోజు ముందు మీరు, తర్వాత సత్యవతిగారు. మీకు జరిగిన అన్యాయానికి ఇదో సద్దుబాటు. ఏమంటారు?" అన్నట్లు సత్యవతిగారి వంక చూశాను.

ఆమె నవ్వుతూ శ్రీమతిని చూసి, "నాకైతే ఆయన పాట గురించి తెలుసు. కానీ ఏమో అనుకున్నాను. మీవారు చాలా తెలివైనవారు. మాటల్లో గొంతు వినే, మావారి ప్రతిభను పట్టేశారు.  గాయాలకు సిద్ధపడుతూ, మందుని కూడా ఏర్పాటు చేశారు" అంది.

“అమ్మో! ఏం దెబ్బ కొట్టావ్! నా పాట వింటే వీళ్లకి గాయాలౌతాయా? వాటికి ఉపశమనంగా నీ పాటని ముందే ఏర్పాటు చేశారా? స్వోత్కర్షకి ఇంతకంటే గొప్ప ఉదాహరణ ఉంటుందా?” అని రావుగారు గుండెలు బాదుకోవడాన్ని అభినయించాడు.

“మీకలా అనిపించిందా? నాకైతే– ‘దివిజ కవివరు గుండియల్ దిగ్గురనగ అరుగుచున్నాడు శ్రీనాథుడమరపురికి’ అన్న మహాకవి హుందాతనం తోచింది” అన్నాను నేను వెంటనే.

మనసులో మాత్రం ఆ దంపతుల సంభాషణా చాతుర్యంకూడా– ఆమె సంగీతప్రతిభకు దీటొచ్చే ఆహ్లాదమనిపించింది.

“సరే, నేను తూటాలు వదుల్తున్నాను. నువ్వు మందు ఏర్పాట్లు చూసుకో” అని రావుగారు గొంతు సవరించారు.

“అప్పుడే తూటాలు వదలకండి. మేమంతా పొజిషన్సు తీసుకోవాలి కదా!” అంది సత్యవతి అక్కడికి యుద్ధమేదో మొదలౌతున్నట్లు.

రావుగారితో సహా అంతా ఫక్కుమన్నాం.

సత్యవతి, శ్రీమతి అక్కడ నేలమీద కంబళి పర్చారు. రావుగారబ్బాయి అప్పటికే అలసిపోయి నిద్రపోతుంటే, తనని సోఫాలోకి మార్చారు.

నేను శ్రీమతి, పాప, బాబు– కంబళిమీదకు మారాం.

మా పాపకి పాటలంటే చెప్పలేనంత ఆసక్తి.

అప్పటికే సత్యవతిగారి ‘హృదయతంత్రులు మీటిన మృదుల జీవితవీణని’ ఎన్నో మార్లు మా ఇంట్లో పలికించింది. అప్పటికింకా ఐదేళ్లు నిండకపోయినా, మూడేళ్ల వయసుకే కనీసం ఐదారు తెలుగు పాటల్ని సాహిత్య సంగీత పరంగా కంఠస్థం చేసిన ప్రజ్ఞ దానిది.

అదిప్పుడు రావు దంపతుల గానంకోసం, గాయకుల స్వప్నశ్రోత స్థాయి పోజిచ్చి బుద్ధిగా ఎదురు చూస్తోంది.

మూడేళ్లు నిండిన మా బాబు ఏం పట్టించుకోనట్లే ఉంటాడు కానీ, తర్వాత తను చేసే వ్యాఖ్యలతో, ఇవన్నీ వీడెప్పుడు గమనించాడా అని మమ్మల్ని అశ్చర్యపరుస్తుంటాడు. ఇప్పుడు నిద్ర వస్తోందని అమ్మ ఒడిలో చేరాడు కానీ, వాడి నిద్ర నిజమా అన్నది అనుమానమే!

రావుగారు నోటితో పిస్టలు కాల్చిన శబ్దం చేసి, “అంతా పొజిషన్స్ టేకప్ చేశారా? బీ రెడీ! ఇప్పుడు నేను ‘తెనాలి రామకృష్ణ’ లో పద్యాలు పాడబోతున్నాను” అన్నాడు.

ఆశ్చర్యపోయాను.

నేను తెనాలి రామకృష్ణ సినిమా చూసి అప్పటికి పంతొమ్మిదేళ్లయింది. మొదటిసారి చూసేక మళ్లీ చూడలేదు.

సినిమా వచ్చిన కొత్తలో అందులోని పద్యాలు బయట జరిగే కార్యక్రమాల్లో పందిళ్లలో వినిపించేవి.

రేడియోలో ఐతే– 'చందనచర్చిత నీలకళేబర' అన్న జయదేవుడి గీతం, 'చేసేది ఏమిటో చేసెయ్యి సూటిగా' అన్న ఘంటసాల పాట మాత్రం చాలా ఏళ్లపాటు వినిపించేవి.

ఇప్పుడు ఇన్నేళ్ల తర్వాత అందులో పద్యాలు– అదీ పశ్చిమజర్మనీలో పశ్చిమబెర్లిన్ నగరంలో మళ్లీ వినడమంటే– ఆశ్చర్యమేగా మరి!

రావుగారు ఓ క్రమంలో ఆ సినిమాలో కొన్ని పద్యాల్ని వినిపించాడు. మధ్యలో వాటిని అనుసంధానించడానికి చిత్రంలోనివే సంభాషణలూ జత కలిపాడు.

అందరికీ సుపరిచితాలే కాబట్టి ఆ సన్నివేశాల్నీ, పద్యాల్నీ, సంభాషణల్నీ– అవసరం అనిపించినమేరకే విశదీకరిస్తాను. ఐతే చిత్రంలోని అన్ని పద్యాల్నీ కాక– కేవలం రావుగారు ఎన్నుకున్నవాటిని మాత్రమే ఇక్కడ ప్రస్తావిస్తాను.

**మొదటి పద్యం:** తెనాలి రామకృష్ణుడు రాయలవారిని దర్శించినప్పుడు– 'నరసింహ కృష్ణ రాయల, కరమరుదగు కీర్తి వెలయు, కరిభిత్ గిరిభిత్ కరి కరిభిత్ గిరి గిరిభిత్ కరిభిత్ గిరిభిత్తురంగ కమనీయంబై' అని ప్రసంసించాడు.

ఆయన గొంతు ఘంటసాలలా లేదు. కానీ పద్యం వింటుంటే ఘంటసాలే గుర్తుకొచ్చాడు. కారణం ఆయన అచ్చం ఘంటసాలకి లాగే పాడాడు.

శబ్దంలో, స్వరంలో ఇంత గొప్పతనం ఇముడ్చుకున్న పద్యాన్ని– బెర్లిన్ దాకా పదిలపర్చి తెచ్చుకున్నాడు రావుగారు. మరి నేను తెలుగు నాట ఉండీ– దీన్ని పట్టించుకోలేదంటే సిగ్గు పడాల్సిన విషయమనిపించింది.

ఈ పద్యం నేటికీ ఘంటసాల గాత్రంతో సహా నెట్టింట పదిలంగా ఉంది.

పద్యభావాన్నిక్కడ వివరించను. ఆసక్తి కలవారికి– పద్యభావం ఇప్పుడు గూగుల్లో దొరుకుతోంది.

**రెండవ పద్యం:** రామకృష్ణుడు అష్టదిగ్గజాల్లో ఒకడైన నంది తిమ్మనను పొగుడుతూ, 'మా కొలది జానపదులకు, నీ కవనపు ఠీవి యబ్బునే, కూపనటద్భేకములకు గగనధునీ శీకరముల చెమ్మ నంది సింగయ తిమ్మా' అంటాడు సవినయంగా.

**మూడవ, నాల్గవ పద్యాలు:** ఎవరి కవిత్వంలోనైనా తప్పులు పడతాననీ, ఎంత క్లిష్టమైన పద్యానికయినా క్షణాల్లో అక్షరరూపం ఇవ్వగలననీ– దంబాలు పలికిన నరసకవికి గర్వభంగం కలిగించడానికి రామకృష్ణుడు 'త్ృవ్వట బాబా తలపై...' అంటూ మొదటి అక్షరంతోనే వ్రాయసగాణ్ణి తికమక పెడతాడు. తరువాత, 'తెలియనివన్ని తప్పులని' పలికినందుకు నరసకవిని, 'ప్రగడరాణ్ణరసా విరసా తుసా భుసా' అని తీవ్రంగా కోప్పడతాడు.

పద్యం చదివేక రావుగారు, 'శాంతించండి రామకృష్ణ కవీ! జయాపజయములు దైవాధీనములు' అని రాయలు సముదాయించడంలో ఎన్టీఆర్ గొంతుని మిమిక్రీ ఆర్టిస్టుల స్థాయిని ప్రదర్శించాడు.

**ఐదవ పద్యం:** అష్టదిగ్గజాల్లో ఒకడైన దూర్జటిని మెచ్చుకుంటూ రాయలు ఒకసారి, "స్తుతమతియైన ఆంధ్రకవి ధూర్జటి పల్కులకేల కల్గె నీ యతులిత మాధురీ మహిమ?" అన్నాడు. దానికి రామకృష్ణుడు, "హా! తెలిసెన్; భువనైకమోహనోద్ధత సుకుమార వారవనితా జనతా ఘనతాపహారి సంతత మధురాధరోదిత సుధారస ధారలు గ్రోలుటం జుమీ" అని బదులిచ్చాడు. దీని అర్థం, 'ఆఁ తెలిసింది. దీనికి కారణం ధూర్జటిగారు సదా సుందరాంగులైన వేశ్యల సంపర్కంలో ఉండి, వారి అధరామృతాన్ని సేవించడంవల్లనే ఆయన కవిత్వం అంత తీయగా ఉంటున్నది' అని. ఇది చెప్పి, 'అంతేనా తాతయ్యా' అంటాడు రామకృష్ణుడు. 'ఔనేమో మనవడా!' అని ధూర్జటి బదులివ్వగానే సభికులందరూ ఘొల్లుమంటారు.

పద్యం చివర్లో రావుగారు ఏయన్నార్ గొంతుని చక్కగా అనుకరించాడు.

**ఆరవ పద్యం:** రామకృష్ణుణ్ణి ఆట పట్టించాలని ఓ కవి– కోట కాపలావాడి చేత 'కుంజర యుధంబు దోమ కుత్తుక జొచ్చెన్' (ఏనుగుల గుంపు దోమ గొంతులోకి దూరింది) అనే సమస్యని పూరించమని రామకృష్ణుణ్ణి అడిగిస్తాడు. దానికి రామకృష్ణుడు, 'గంజాయి తాగి, తురకల సంజాతము చేత, కల్లు చవిగొన్నావా, లంజల కొడకా, ఎక్కడ కుంజర యుధంబు దోమ కుత్తుక జొచ్చెన్?' అని అడిగించిన వాడికి దిమ్మ తిరిగేలా జవాబిచ్చాడు. ఐతే ఆ కవి అంతటితో వదలక రామకృష్ణుణ్ణి ఇరుకున పెట్టడంకోసం, అదే సమస్యని రాయలవారి చేత అడిగిస్తాడు. దానికి రామకృష్ణుడు, 'పాండవులంతటివారు విరాటరాజు కొలువులో చేరడం, ఏనుగుల గుంపు దోమ గొంతులో దూరినట్లుందని' పూరించాడు. ఆ సమస్య నేపథ్యం తెలిసిన రాయలవారు, 'నీ బుద్ధికి రెండు పక్కలా పదునే రామకృష్ణయ్యా' అని అభినందిస్తాడు.

**ఏడవ పద్యం:** ఒకసారి నిండుసభలో అష్టదిగ్గజాలలో ఒకడైన అల్లసాని పెద్దన రాయలవారిని ప్రశంసిస్తూ, 'బృహన్నల కాకపోతే విలువిద్యలో అర్జునుణ్ణీ, గుహ నివాసం కాకపోతే బలంలో సింహాన్నీ, చంచలం కాకపోతే ఓర్పులో భూమినీ, బ్రహ్మహత్య చేసి ఉండకపోతే వైభవంలో ఇంద్రుణ్ణీ రాయలవారితో పోల్చవచ్చునని' అర్థం వచ్చేలా 'శరసంధాన...' అంటూ ఓ పద్యం చెబుతాడు. అక్కడే ఉన్న రామకృష్ణుడు అది విని మందహాసం చేస్తే, 'వికటకవు లెందుకో నవ్వుతున్నారు' అంటాడు రాయలు. బదులుగా రామకృష్ణుడు, 'తోక ముడిచి బిలప్రవేశం చేసే సింహం, ప్రభువులకు సాటి కాదంటూనే– రాజకంఠీరవా అని తాతగారు సంబోధిస్తుంటే నాకు నవ్వొచ్చింది' అని కారణం చెబుతాడు. రాజకంఠీరవా అంటే రాజసింహమా అని అర్థం మరి.

దానికి పెద్దన ''మంచి పట్టే పట్టావు మనవడా, ఏదీ నువ్వో పద్యం చదువు, చూదాం' అంటాడు. అప్పుడు రామకృష్ణుడు, 'యుద్ధంలో రాయలవారి కత్తితో నరకబడ్డ శత్రురాజులు, సూర్య మండలాన్ని దాటి వీరస్వర్గానికి వెడుతూ, ఆ మధ్యలో విష్ణుమూర్తిని జూసి, రాయలే అనుకుని భయపడి పారిపోతున్నారని' అర్థమొచ్చేలా 'కలనం దావక ఖడ్గ ఖండితరిపుక్ష్మాభర్త...... నీవ యను శంకన్ కృష్ణరాయాధిపా!' అంటూ ఓ పద్యం చెబుతాడు.

**ఎనిమిదవ, తొమ్మిదవ పద్యాలుః** ఇవి రెండూ సీసపద్యాలు. సీసపద్యాల్లో నాలుగు పొడుగు పాదాలు, నాలుగు పొట్టి పాదాలు ఉంటాయి. పోతనామాత్యుడు వ్రాసిన 'మందార మకరంద మాధుర్యమున దేలు మధుపంబు పోవునే మధుపములకు' అన్న ప్రముఖ పద్యం సీసపద్యాలకు గొప్ప ఉదాహరణ. రాయల సభకు వచ్చిన ఓ కవి విచిత్రమైన సీసపద్యం చదివి దానికి అర్థం చెప్పమని అక్కడి కవి పండితుల్ని సవాలు చేస్తాడు. ఆ పద్యంలో మొదటి పొడుగు పాదం– 'రాజనందన రాజ రాజాత్మజుల సాటి, తలప నల్లయ వేమ ధరణి పతికి'. చిత్రమేమిటంటే. మిగతా మూడు పాదాలకూ కూడా అదే వాక్యం వాడబడింది. వాక్యం అదే అయినా ఒకో పాదంలో దాని అర్థం ఒకోలాగానూ, భిన్నంగానూ ఉంటుంది. అలాగే పొట్టి పాదాలు నాలుగూ కూడా, 'భావభవ భోగ సత్కళా భావములను' అనే వాక్యాన్నే కలిగి ఉంటాయి, అర్థాలు మాత్రం విభిన్నం.

ఇది విన్న రామకృష్ణుడు తనూ అదే తరహాలో, 'మేకతోకకు మేకతోక మేకకు తోక మేకతోకామేక తోకమేక' అనే నాలుగు పొడుగు పాదాలూ, 'మేకకొక తోక మెకమేక తోకమేక' అనే నాలుగు పొట్టి పాదాలతో సీసపద్యం చెప్పి– దానికి అర్థం చెప్పమని వచ్చిన కవిని తికమక పెడతాడు. ఆ పద్యానికి అర్థం– మేకలు ఒకదాని ఒకటి గుంపుగా వెడుతున్నాయని!

ఇవీ రావుగారు మాకా రోజు వినిపించిన భువనవిజయ పద్యాలు.

ఆయన ఆ పద్యాలు చదువుతుంటే, మధ్యమధ్య మాటలు జోడిస్తుంటే– ఆ దృశ్యాలన్నీ కళ్లకు కట్టాయి.

మనసుకి ఆహ్లాదం. తనువుకి పరవశం.

"ఎప్పుడో చూసిన సినిమా. ఇప్పుడు చూస్తున్నట్లుంది" అన్నాను.

"అది ఆ చిత్రం గొప్పతనం. అందులో ఏ దృశ్యాన్నయినా కొంచెం గుర్తు చేస్తే చాలు. మొత్తం కళ్లకు కట్టేస్తుంది. అంతలా హృదయంలో తిష్ట వేసుకునేలా తీశారు ఆ చిత్రాన్ని. సముద్రాల, విశ్వనాథన్–రామ్మూర్తి, ఎన్టీఆర్, ఏయన్ఆర్, ఘంటసాల, సుశీల, బియస్ రంగా– ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు" అన్నాడు రావుగారు వినయంగా.

విశేషమేమిటంటే ఆయనకు ఆ చిత్రానికి సంబంధించి సాంకేతిక నిపుణులతో సహా అన్ని వివరాలూ గుర్తున్నాయి.

"ఏమో నాకు మాత్రం మీరే మహానుభావులు. సుమారు రెండు దశాబ్దాలక్రితం ఇంత గొప్ప చిత్రాన్ని చూసేనన్న అనుభూతి నాకిప్పుడే కలిగింది" అన్నాను నిజాయితీగా.

"మరీ అంతలా పొగిడెయ్యకండి. ఆయన నిజమనుకునేరు" అంది సత్యవతిగారు.

రావుగారు ఆమెవంక కాక నావైపు చూస్తూ, "అలాగంటుందా, నిజానికి నా పాటల్ని మీకంటే ఎక్కువగా పొగిడేది తనే! కాదనమనండి, చూద్దాం" అన్నాడు.

సత్యవతిగారు ఠక్కున, "ముందరికాళ్లకు బంధం" అంది.

రావుగారూ తడుముకోలేదు, "నిజమే, తన పొగడ్తలు నాకు ముందరికాళ్లకు బంధమే! నేను మొహమాటస్థుణ్ణి కదా, గట్టిగా ఎవరైనా పొగిడితే పాట పాడ్డం మానేస్తాను. నేనెక్కడ తనని మించిపోతానో అని, నేనిలా పాట మొదలెట్టగానే అలా తను పొగిడేస్తుంది. ఇంట్లో పాడి ఎన్నేళ్లయిందో, ఏదో మీ దయవల్ల మళ్లీ ఇన్నాళ్లకి నాకో అవకాశమొచ్చింది" అన్నాడు.

"ఆయన చెప్పిందాంట్లో నిజానిజాలు మీరే అంచనా వేసుకోండి. ఓ చిన్న క్లూ ఇస్తాను. మీచేత అడిగి మరీ పాడించుకుని, తను మొహమాటస్థుణ్ణి అంటున్నారాయన. ఇందాకా రాజకంఠీరవా అన్నట్లు లేదూ?" అంది సత్యవతిగారు.

రావుగారు నవ్వేశారు. అంతా నవ్వేశారు.

సంగీతం విషయంలో రావుగారు నివురు గప్పిన నిప్పన్న విషయం అప్పుడే గ్రహించిన నేను, "జోక్సుకేం కానీ, రావుగారూ– ఒక శ్రోతగా నేనిది చెబుతున్నాను. మీరు స్టేజి పెర్ఫార్మెన్సు ఇవ్వాల్సిన గాయకులు" అన్నాను.

రావుగారి మొహం గంభీరంగా ఐపోయింది, "నాకా విషయం ఎప్పుడో తెలుసు రావుగారూ! జర్మనీ చాన్సు రాగానే ఇండియాలో ఎంతోమందికి చిలక్కి చెప్పినట్లు చెప్పాను– ఇప్పుడున్నవాళ్లే శాశ్వతం అనుకోకూడదు, ఎప్పుడూ అదనంగా కొందరు ప్రతిభావంతుల్ని ఆకట్టుకుని ఉంచుకోవాలని. ఒక్కళ్లు పట్టించుకోలేదు. మరి ఆ మహానుభావుడు ఘంటసాల మనందర్నీ దుఃఖసముద్రంలో ముంచేసి అర్థాంతరంగా వెళ్లిపోయాడా– ఇప్పుడు తెలిసొచ్చి ఏడుస్తున్నారు. కానీ ఏం లాభం? ఇక్కడ ఈ సుఖాలకి అలవాటు పడ్డాక, ఎదురెత్తు ధనమిస్తానన్నా నేనా ఫీల్డులోకి వెడతానా?" అన్నాడు.

అహం లేనివారు తమని తాము పొగుడుకోవడాన్ని కూడా వేళాకోళంగా మార్చేస్తారు.

తెలుగువారికి పద్యం ప్రత్యేకం. తెలుగు నాట నాటకాల్లో ఓ వెలుగు వెలిగిన పద్యాన్ని, సినిమాలకు అన్వయించి అనుకరించిన ఘనత ఘంటసాలది. ఆయనంత గొప్పగానూ పద్యాల్ని ప్రాచుర్యం చేసిన మరో సినీ గాయకుడు మాధవపెద్ది.

పాటకంటే కూడా పద్యం పాడడం సినీ గాయకులకు పెద్ద పరీక్ష. అలాంటి పద్యాల్ని ఇంత అలవోకగా వినిపించిన రావుగారి ప్రజ్ఞని ఆయనే వేళాకోళం చేసినా భరించలేకపోయాను. అందుకే ఆయన మాటలకి నాకు నవ్వు రాలేదు, "కొత్తగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అనే కుర్రాడు పుంజుకుంటున్నాడు. కానీ అతడిది సాఫ్ట్ వాయిస్. వినడానికి మీ గొంతు పిబి శ్రీనివాసుకి దగ్గరలో ఉన్నా– పద్యాలు చదువుతుంటే ఘంటసాలనే గుర్తు చేస్తుంది..." అని ఇంకా ఏదో అనబోతుంటే....

రావుగారు నన్నాపి, "ఇలా అంటున్నానని ఏమనుకోకండి. పిబి శ్రీనివాస్ అంటే నాకూ ఇష్టమే కానీ, నాకు నా గొంతు ఘంటసాల గొంతు లాగే అనిపిస్తుంది" అని, "నేననుకుని ఏం లాభం– మీరనుకోలేదుగా" అన్నాడు.

"ఆయనకి మీ గొంతు ఎవరిదిలా అనిపించినా, పాట ఘంటసాలలాగే పాడేరని అన్నారుగా- అది చాలలేదా మీకు?" అంది సత్యవతి.

"ఎలా సరిపోతుంది? నా ప్రతిభని ఈయన గుర్తించి ఏం లాభం? ఈయనది ఆ ఫీల్డూ కాదు, గుర్తింపుకిది టైమూ కాదు" అని నిట్టూర్చి ఆ వెంటనే నవ్వేశారు.

ఆ నిట్టూర్పూ, దాన్ననుసరించిన నవ్వూ-

అదీ టైమింగంటే...

ఒక్కసారి అందరం ఘొల్లుమన్నాం.

ఏ మర్థమయిందో మా పాప కూడా నవ్వేసింది.

నవ్వుల్లోంచి తేరుకున్నాక, "ఔనూ- ఇందాకా ఏదో గాయాలు, మందు అన్నావు. మందు అక్కర్లేదనిపిస్తోందా?" అన్నాడు రావుగారు.

దానికి సత్యవతి వెంటనే, "చూసేరా, ఆయన పాటకి ఆయనకే గాయమై సలుపుతున్నట్లుంది. మందు గురించి గుర్తు చేస్తున్నారు" అంది.

అప్పుడు నేను కలగజూసుకుని, "నో మోర్ జోక్స్. లెటజ్ స్టార్ట్ ది ప్రోగ్రాం" అన్నాను.

సత్యవతి గొంతు సవరించుకుంది.

పాప స్వప్నశ్రోతలా కళ్ళప్పగించి ఆమెనే చూస్తోంది......

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments